



పరవశించిన నాగావళి

దీపాల కాంతులతో దేదీప్యమానంగా నాగావళి తీరం



పూజలందుకుంటున్న ఉమారుద్రకోటేశ్వరస్వామి

- దీపాల కాంతులతో శోభిల్లిన నదీ తీరం
- జిల్లాలో ఘనంగా పోలి పాడ్యమి పూజలు

శ్రీకాకుళంలోని నాగావళి తీరం పరవశించింది. భక్తులు దీపాలు వెలిగించడంతో దేదీప్యమానంగా శోభిల్లింది. పోలిపాడ్యమి సందర్భంగా సోమవారం నాగావళికి భక్తులు పుణ్య హారతులను అర్పించారు. భక్తులు వెలిగించిన దీపాలు పౌర్ణమిని తలపించాయి. జిల్లాలోని శైవక్షేత్రాలు, ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు భక్తులతో కిటకిలాలాడాయి. శ్రీకాకుళంలోని ఉమారుద్రకోటేశ్వరాలయం, కలెక్టర్ బంగ్లా సమీపంలోని కల్యాణ తిరుమల క్షేత్రంతో పాటు వివిధ ఆలయాలకు వేకువజామునే భక్తులు చేరుకుని పూజలు చేశారు. నాగావళి నదీ తీరాన తెప్పలు వదిలి దీపారాధనలు చేశారు. అరసవల్లిలోని ఇంద్రపుష్కరిణిలో అరటిదవ్వల్లో దీపాలు వెలిగించి.. విడిచిపెట్టారు.

- శ్రీకాకుళం కల్చరల్



నదిలో దీపాలు విడిచిపెడుతున్న మహిళలు

ఊరూవాడా బెల్టు

- వేలం పాట ద్వారా షాపుల కేటాయింపు
- మద్యం వ్యాపారుల బరితెగింపు
- బూరగాంలో రూ.4.75 లక్షలు పలికిన వైనం
- చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్న ఎక్సైజ్ శాఖ

-బెల్టుషాపుల కోసం వేలం పాటలు వేస్తే చర్యలు తప్పవు. వారు పార్టీ కార్యకర్త అయినా, నాయకుడు అయినా సహించేది లేదు. పది ఓట్లు పోయినా పర్వాలేదు గానీ, బెల్టుషాపులకు వేలంపాటలు వేస్తే ఉపేక్షించేది లేదు.

- నాలుగు రోజుల కిందట సంతబొమ్మాళిలో జరిగిన బహిరంగ సభలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



టెక్కలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మద్యం దుకాణాల యజమానుల్లో చాలామంది ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తే సహించేది లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదేపదే హెచ్చరిస్తున్నా పట్టించుకోవడం లేదు. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు గ్రామాల్లో బెల్టు షాపులను ప్రోత్సహిస్తున్నారు. వేలం పాట ద్వారా వాటిని కేటాయిస్తున్నారు. కొందరు వ్యక్తులు రూ.లక్షలు చెల్లించి బెల్టుదుకాణాలను దక్కించుకున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. టెక్కలి మండలం బూరగాంలో ఒక ఏడాదికి గాను బెల్టు షాపు పెట్టేందుకు వేలం పాట నిర్వహించగా ఓ వ్యక్తి రూ.4.75లక్షలకు దక్కించుకున్నాడు. శాసనాంలో రూ.3.90లక్షలు, కొండభీంపురంలో రూ.85వేలు, బూరగాం ఎస్సీ కాలనీలో రూ.లక్ష, టెక్కలి ఆదీఆంధ్రా వీధిలో రూ.45వేలకు బెల్టు షాపులు పలికాయి. వీటితో పాటు అయ్యప్పనగర్, తదితర ప్రాంతాల్లో వేలం పాటలు జరిగినట్లు తెలుస్తోంది. మొత్తంగా బెల్టుషాపుల నిర్వహణకు పలు గ్రామాల్లో వేలం వేయడం చూస్తుంటే మద్యం వ్యాపారులు ఏ స్థాయిలో బరితెగిస్తున్నారో అర్థమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ షరీఫ్ వివరణ కోరగా.. తన పరిధిలో బెల్టు షాపులపై 14 కేసులు నమోదు చేశామని, సమాచారం తెలిస్తే చర్యలు తప్పవని అన్నారు.



వైసీపీ పాపం.. మిల్లర్లకు శాపం..



చాపరలో ఖాళీగా ఉన్న రైస్ మిల్లు

- రూ.కోట్లలో పేరుకుపోయిన బకాయిలు
- ధాన్యం కొనుగోలుకు వెనుకంజ
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- బకాయిలను బీజీల కింద మినహా ఇస్తామనడంతో ఆందోళన

● మెళియాపుట్టి మండలం చాపర గ్రామంలోని ఓ రైస్ మిల్లు యజమానికి గత వైసీపీ ప్రభుత్వం రూ.80లక్షలు బకాయి పడింది. దీంతో ఈ ఏడాది ఎలా వ్యాపారం చేయాలో తెలియక ఆయన ఆందోళన చెందుతున్నాడు. బకాయి చెల్లించాలని అడితే ఈ ఏడాదికి సంబంధించిన బ్యాంకు గ్యారెంటీలు కింద మినయిస్తామని అధికారులు చెబుతున్నారని మిల్లు యజమాని వాపోతున్నాడు.

● చాపర గ్రామానికి చెందిన మరో మిల్లు యజమాని వైసీపీ దెబ్బకు తన రైస్ మిల్లుని కల్యాణ మండపంగా మార్చేశాడు. గత ఐదేళ్లలో లక్షల రూపాయల బకాయి వైసీపీ ప్రభుత్వం అయనకు చెల్లించలేదు. ఎన్నిసార్లు అడిగినా స్పందన లేకపోవడం, పైగా ఇబ్బందులకు గురిచేయటంతో తన వ్యాపారానికి స్వస్తి పలికాడు. రైస్ మిల్లును కల్యాణ మండపంగా మార్చేశాడు.



మెళియాపుట్టి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) వైసీపీ ప్రభుత్వ పాపం మిల్లర్లకు శాపంగా మారింది. కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోవడంతో మిల్లులు నడపలేని పరిస్థితి నెలకొంది. అధికారులను అడిగితే బ్యాంకు గ్యారెంటీలు(బీజీ) కింద మినహాయిస్తామని చెబుతున్నారు. దీంతో మిల్లులు నడపలేక.. మూసివేయ లేక సతమతమవుతున్నారు.కొందరు యజమానులు తమ మిల్లులను కల్యాణ మండపాలు, ఇతర వ్యాపార కేంద్రాలుగా మార్చుకుంటు న్నారు. ధాన్యం మిల్లింగ్‌కు సంబంధించి మిల్లర్లకు సార్టెక్స్, డ్రయ్యర్, బియ్యం రవాణా, కస్టోడియన్, సంచుల వినియోగం, తదితర చార్జీలు చెల్లించాల్సి ఉంది. వాటి చెల్లింపుల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం తాత్సారం చేసుకుంటూ వచ్చింది. దీంతో గత ఐదేళ్లలో జిల్లాలో సుమారు రూ.20 కోట్ల బకాయిలు పేరుకు పోయాయి. గత ఏడాది సుమారు 250 మిల్లులు మాత్రమే ధాన్యం కొనుగోలు చేశాయి. బకాయిలు పేరుకుపోవడం తదితర కారణాలతో చాలామంది మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు బీజీలు చెల్లించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఉండడంతో బిల్లులు సక్రమంగా అందుతాయానే దీమా మిల్లర్లలో నెలకొంది. తమ ప్రభుత్వం రైతులతో పాటు మిల్లర్లకు న్యాయం చేస్తుందని, ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. బకాయిల సొమ్మును బ్యాంకు గ్యారెంటీల్లో కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ఏడాది ధాన్యం కొనుగోలుకు 570 మిలర్లు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. మరోపక్క ధాన్యం విక్రయించిన రైతులకు కూడా 48 గంటల్లోపే బిల్లులు చెల్లిస్తోంది. వారి ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ సర్కారు హయాంలో ధాన్యం విక్రయించిన తర్వాత నగదు కోసం ఎదురుచూడాల్సి వచ్చేదని, కూటమి ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు.

రుణాల పండగ

- త్వరలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందజేత
- మహిళలకే అధిక ప్రాధాన్యం
- జిల్లాకు రూ.133 కోట్లు కేటాయింపు
- 8,971 మందికి చేకూరనున్న లబ్ధి

శ్రీకాకుళం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లను నిర్వీర్యం చేసింది. ఐదేళ్ల పాలనలో వాటి ద్వారా ఒక్క రుణం కూడా ఇవ్వలేదు. అయితే, కూటమి ప్రభుత్వం రావడంతో కార్పొరేషన్లకు జవసత్వాలు వచ్చాయి. బీసీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణాలు మంజూరు చేసేందుకు సంకల్పించింది. అతిత్వరలో ఈ ప్రక్రియ ప్రారంభంకానుంది. ఇప్పటికే జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంతమందిని ఎంపిక చేయాలి, టార్గెట్, వెచ్చించనున్న నిధుల వివరాలను కూడా ప్రభుత్వం వెల్లడించింది. 2014-19 కాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పల్స్ సర్వే ప్రాతిపదికగానే ఇప్పుడు రుణాలు మంజూరు చేయన్నారు.



జిల్లాకు రూ.133 కోట్లు

జిల్లాలో బీసీ కార్పొరేషన్ ద్వారా 8,971 మందికి లబ్ధిచేకూరే విధంగా ప్రభుత్వం ప్రణాళికను సిద్ధం చేసింది. మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వనుంది. ఆరు రంగాల్లో శిక్షణ ఇచ్చి లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. రూ.133.59 కోట్ల రుణాలను అందించనుంది. ఈ ప్రక్రియ మరో నాలుగు నెలల్లో పూర్తికానుంది. లబ్ధిదారునికి బ్యాంకు రుణం మంజూరు చేయడమే కాకుండా, జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ నుంచి ప్రోత్సాహం, ఆపై లబ్ధిదారుని వాటాతో కలిపి రుణంగా అందజేస్తారు. ఇప్పటికే జిల్లా నుంచి ప్రభుత్వానికి నివేదిక చేరింది.

వివిధ అంశాలపై శిక్షణ

బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలను పొందేందుకు కొన్ని రంగాలను ఎంపిక చేసి, వాటిలో లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వనుంది. శిక్షణ అనంతరం రాయితీపై స్వయం ఉపాధి కోసం రుణాలు అందించనుంది. ఫ్యాషన్ డిజైనింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్లలో మహిళలకు శిక్షణ ఇవ్వనున్నారు. యువతకు ఇండస్ట్రీస్ సర్వీస్ బిజినెస్, చేతివృత్తులకు సహకారం, వ్యవసాయ, పాడి పరిశ్రమాభివృద్ధి వంటి సేవల విభాగంలో రుణాలను ఇవ్వనుంది. అలాగే చిన్నతరహా కుటీర పరిశ్రమలు, బిజినెస్ యూనిట్లు, మినీ డెయిరీ యూనిట్లు, గొర్రెలు, మేకల పెంపకం, వెదురుబుట్టల తయారీ, కుమ్మరి, వడ్రంగి తదితర చేతివృత్తులకు ఆర్థిక సహకారాన్ని అందిస్తారు. హౌస్ కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజెస్ సర్వీస్, చెఫ్, సెక్యూరిటీ గార్డులు.. ఇలా ఈ విభాగాల్లో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలనూ కల్పిస్తా రు. అలాగే జనరిక్ మందుల దుకాణాలను కూడా విరివిగా ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకుగాను బీ-ఫార్మసీ చదవిన బీసీ యువతకు శిక్షణ ఇచ్చి, జనరిక్ దుకాణం ఏర్పాటు చేయనుంది. అందుకు సంబంధించి ఖర్చును ప్రభుత్వమే భరిస్తుంది. మండలాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ, దరఖాస్తు చేసుకునే విధానం అతిత్వరలో విడుదలకానుంది.

పెండింగ్ అర్జీలను పరిష్కరించాలి

- 'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఫుండ్కర్



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ అర్జీలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ఫుండ్కర్ అధికారులను ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీదారుల నుంచి 70 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. జిల్లా అధికారులు తమ కార్యాలయాలు, గృహాల వద్ద సోలార్ పలకల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఏపీఈపీడీసీఎల్ అధికారులను సంప్రదించాలని సూచించారు. 70 ఏళ్ల పైబడిన వారికి కొత్త పీఎంజేఏపై కార్డుల కోసం నమోదు చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. అర్జీలు రీఓపెన్ కాకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌లో జిల్లా పరిపాలన కార్యాలయానికి కేటాయించిన స్థలం సరిపోతుందో లేదో చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- సౌదీలో చిక్కుకున్న జిల్లా వలస కార్మికులకు కేంద్రమంత్రి రామ్మోహన్ భరోసా

శ్రీకాకుళం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి):' మీరు అధైర్య పడొద్దు.. మేము అండగా ఉంటాం. అందరినీ స్వదేశానికి తీసుకొస్తాం.' అని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు సౌదీలో చిక్కుకున్న జిల్లా కార్మికులకు భరోసా ఇచ్చారు. ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, వజ్రపుకొత్తూరు, నందిగాం, ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లాకు చెందిన సుమారు 30 మంది వలస కార్మికులు సౌదీ వెళ్లి చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. రెండు మాసాలు పనిచేసినా సంబంధిత యాజమాన్యం జీతాలు చెల్లించకపోవడం, గత నాలుగు రోజులుగా తిండి కూడా లేకపోవడంతో వారంతా అల్లాడిపోయారు. ఈ విషయాన్ని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్.. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. బాధిత కార్మికులతో సోమవారం ఫోన్‌లో మాట్లాడారు. అందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చేలా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌ను కలసి ఒప్పిస్తానని తెలిపారు. అలాగే భారత ఎంబసీ కార్యాలయానికి విషయాన్ని చేరవేస్తానని చెప్పారు.



సౌదీలో చిక్కుకున్న కార్మికులతో వీడియో కాల్‌లో మాట్లాడుతున్న రామ్మోహన్

గంజాయి వ్యాపారుల ఆస్తులు జప్తు చేయాలి

- విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

అరసవల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి వ్యాపారులను గుర్తించి, వారి ఆస్తులను జప్తు చేయాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలతో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గంజాయి నిందితులు, వారి ఆస్తుల జప్తు చేసేందుకు చేపట్టాల్సిన విధివిధానాలు, నిబంధనలను వివరించారు. ఈ విషయంలో చట్టపరంగా ఎటువంటి చిక్కులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రేంజ్ పరిధిలో ఇంతవరకు నమోదైన కేసుల్లో ఆస్తుల గుర్తింపులో సాధించిన పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


దీపాల కాంతుల్లో నాగావళి తీరం


నాగావళి తీరంలో పూజలు


ఉమారుద్ర కోటేశ్వరాలయంలో భక్తుల రద్దీ

పరవశించిన నాగావళి

- దీపాల కాంతులతో శోభిల్లిన నదీ తీరం
- జిల్లాలో ఘనంగా పోలి పాడ్యమి పూజలు

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ముగియడంతో పవిత్ర నాగావళి నదీ తీరంలో పోలి పాడ్యమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వేకువజామున 4 గంటల నుంచే అరటిదవ్వల్లో దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. తీరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఉమారుద్రకోటేశ్వరాలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామూర్తి (రాంజీ) ఆధ్వర్యంలో కోటీశ్వరుడికి అలంకరణ, పూజలు నిర్వహించారు. మహిళలు నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర, బలగ లక్ష్మేశ్వర, శివనాగేశ్వర, బోడెమ్మ కోవెల వద్ద జీవేశ్వర, అయ్యప్ప స్వామి, తదితర ఆలయాల్లో భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి పూజలు నిర్వహించారు.

శ్రీముఖలింలిగానికి పోటెత్తిన భక్తులు..

జలుమూరు, డిసెంబరు 2: (ఆంధ్రజ్యోతి) దక్షిణకాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీముఖలింగేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉదయం 9 గంటల వరకు భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. 10 గంటల తరువాత పరిసర గ్రామాలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. దీక్ష విరమణ కోసం ఒడిశా నుంచి శివస్వాములు శ్రీముఖలింగం చేరుకున్నారు. కేశఖండనశాల వద్ద సరైన సౌకర్యాలు లేక శివస్వాములు అవస్థలు పడ్డారు. వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో పి.ప్రభాకరరావు పర్యవేక్షించారు. ఎస్.ఐ అశోక్‌బాబు నేతృత్వంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.


దీక్ష విరమణకు ఒడిశా నుంచి ఇరుముడులతో వచ్చిన శివస్వాములు


శ్రీముఖలింగేశ్వరస్వామిని దర్శనానికి పోటెత్తిన భక్తులు


దీపాలు విడిచిపెడుతున్న మహిళలు

విద్యార్థులకు సమగ్ర ప్రగతి పత్రాలు

- క్యూఆర్ కోడ్‌తో తల్లిదండ్రులు తెలుసుకునే అవకాశం
- 7న మెగా పేరేంట్స్‌డే రోజున పంపిణీకి సిద్ధం

నరసన్నపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త సంస్కరణలకు నడుంబిగించింది. విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులకు బదులు హోలిస్టిక్ కార్డులు (సమగ్ర ప్రగతి పత్రాలు) పంపిణీ చేయనున్నది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు వీటిని సమగ్రశిక్షాభియాన్ ఆధ్వర్యంలో పంపిణీ చేసింది. గతంలో ప్రతి తరగతికి ప్రోగ్రెస్ కార్డులు ఇచ్చేవారు. వీటిలో విద్యార్థుల హాజరు, మార్కులు ఉండేవి. ప్రస్తుతం కొన్ని మార్పులు చేసి హోలిస్టిక్ కార్డులను రూపొందించారు. ఈ కార్డుల లోపల పేజీలో క్యూఆర్ కోడ్‌ను పొందుపరిచారు.


ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్న హోలిస్టిక్ కార్డులు


ఇవే క్యూఆర్ కోడ్‌తో కలిగిన కార్డులు

ఫోన్ ద్వారా దీన్ని స్కాన్ చేసి.. విద్యార్థి అభ్యసనను గుర్తించవచ్చు. అలాగే విద్యార్థి అభిరుచులు, సామర్థ్యాలు, సవాళ్లను ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఇందులో నమోదు చేస్తారు. విద్యార్థి బ్లడ్ గ్రూప్, ఎత్తు, బరువు, బీఎంఐ వంటి అంశాలు కూడా ఉంటాయి.

- హోలిస్టిక్ కార్డులలో విద్యార్థులు ప్రస్తుతం చదువుచున్న పాఠశాలలో అడ్మిషన్ నెంబరు నుంచి పుట్టిన తేదీ, బ్లడ్‌గ్రూప్, బరువు, బీఎంఐ, గుర్తింపు చిహ్నాలు, ఆధార్ నెంబరు, ఆపార్ ఊడీ, పాన్ నెంబరు, మాతృభాష, తల్లిదండ్రుల పేర్లు, ఫోన్ నెంబర్లతో పాటు చిరునామ పూర్తిస్థాయిలో నమోదు చేయాల్సి ఉంటుంది. అలాగే విద్యార్థుల ఆసక్తులు, సామార్థ్యాలు, వారి వ్యక్తిగత సవాళ్లు, విద్యాపరమైన సవాళ్లు, వాటిని ఎదుర్కొనేందుకు కావాల్సిన సహకారం (ఉదాహరణకు మార్గదర్శకత్వం, బోధన) గమ్యాలు ఈ కార్డులలో పొందుపరుస్తారు. క్యూఆర్ కోడ్ ఫోన్‌లో స్కాన్ చేస్తే విద్యార్థుల మొత్తం వివరాలు కనిపిస్తాయి.

ఈనెల 7న మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్..

ఈనెల 7న ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేయాలని విద్యాశాఖ అదేశాలు జారీ చేసింది. ఈ సమావేశానికి విద్యార్థులు, తల్లిదండ్రులతో పాటు పాఠశాలలో పరిధి గ్రామాల్లోని ఉన్నతాధికారులను ఆహ్వానించాలని, వారు ఈ స్థాయికి చేరుకున్న విధానంపై తెలియజేయాలని అందులో పేర్కొంది. పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలు సమావేశంలో పాల్గొంటారు. అలాగే తల్లులకు ముగ్గుల పోటీలు, తండ్రులు ఆటల పోటీలు నిర్వహిస్తారు. అలాగే ఎండీఎంను తల్లిదండ్రులకు పెట్టాలని సూచించింది. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 1,955, ప్రాథమికోన్నత పాఠశాలలు 269, ఉన్నత పాఠశాలలు 414 ఉన్నాయి. మొత్తం 1,71,535 మంది చదువుచున్నారు. వీరికి హోలిస్టిక్ కార్డులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఇదే సీజన్.. అదే పులి


పులి పాదముద్ర

- ఈసారి టెక్కలి నియోజకవర్గంలో కదలికలు
- ఆవును చంపడంతో సమీప గ్రామాల్లో ఆందోళన
- ప్రజలు అప్రమత్తంగా ఉండలాంటున్న అధికారులు

- నవంబరు 28 సంతబొమ్మాళి మండలం హెచ్‌ఎన్‌పేట పంచాయతీ పెద్దకేశవ నాయుడుపేటలో ఆవును చంపడంతో పులి కదలికలు వెలుగులోకి వచ్చాయి.
- నవంబరు 29న అర్ధరాత్రి పొడుగుపాడు సమీపంలో బిర్లంగిపేట నుంచి కుంచాలపేట వైపు వెళ్తుండగా 108 సిబ్బంది గమనించి భయాందోళనకు గురయ్యారు.
- నవంబరు 30న సారవకోట మండలం చోడసముద్రం ప్రాంతంలో పులి పాదముద్రలను అటవీశాఖ సిబ్బంది గుర్తించారు.
- డిసెంబరు 1న పాతపట్నం మండలం బోరుభద్ర ప్రాంతంలో పులి పాదముద్రలు స్థానికులు గుర్తించారు.

టెక్కలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

ప్రతి ఏటా ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో ఈ పులి భయం కాశీబుగ్గ, టెక్కలి, పాతపట్నం రేంజ్‌ల పరిధి ప్రజానీకాన్ని వణికిస్తోంది. అటవీశాఖ సిబ్బందికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అడపాదడపా పశువులపై దాడి చేయడం.. వాటిని చంపేయడం పరిపాటిగా మారింది.

గత ఏడాది నవంబరు నెలలో ఒడిశాలోని గండహతి ప్రాంతంలో కనిపించి.. మందస అడవుల మీదుగా కవిటి, కంచిలి తీరప్రాంతం మొదలుకుని తిరిగి నందిగాం మండలం కొండల్లో సంచరించింది. టెక్కలి, పాతపట్నం మండలాల్లో కూడా పులిని ప్రత్యక్షంగా ప్రజలు చూడడంతో అటవీశాఖ సిబ్బందిని పరుగులు పెట్టించింది. ఈ ఏడాది కూడా పులి పాదముద్రలు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతుండడంతో అటవీశాఖ అధికారులు, రేంజ్ సిబ్బంది, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు, సహాయ బీట్ ఆఫీసర్లు పులి కోసం అన్వేషిస్తున్నారు. చివరగా సారవకోట మండలం చోడసముద్రం ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించినట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ పనులు కాలం కావడంతో రైతులు, ఆయా గ్రామాల ప్రజానీకం ఈ వార్త భయం కలిగిస్తోంది.


పులి పాదముద్రను గుర్తిస్తున్న అటవీశాఖ సిబ్బంది

మూడున్నరేళ్లుగా కనిపిస్తున్నది ఇదే పులి..

గడిచిన మూడున్నరేళ్లుగా ఇదే పులి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, మన్యం, ఒడిశా ప్రాంతాల్లోని అడవుల్లో సంచరిస్తోంది. ప్రస్తుతం పాతపట్నం రేంజ్ పరిధిలోని చోడసముద్రం ప్రాంతంలో పులి పాదముద్రలు గుర్తించాము. చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలను అటవీశాఖ సిబ్బంది అప్రమత్తం చేస్తున్నారు. దీనికి తోడుగా రెవెన్యూ, పోలీస్ అధికారులకు కూడా సమాచారం అందిస్తున్నాం. ఎక్కడ కూడా మనుషులపై దాడిచేసే పరిస్థితి లేదు. కానీ జంతువులపై పులి అక్కడక్కడా దాడి చేయవచ్చు. ఆవును చంపిన నేపథ్యంలో పశువైద్యుల ధ్రువీకరణ మేరకు సంబంధిత యజమానికి నష్టపరిహారం అందిస్తున్నాం. పులి మనకు ఎదురుపడితే దాన్ని కంగారు పెట్టకుండా పక్కకు తప్పుకోవాలి. పులి ఒక ప్రాంతంలో ఉంటేనే ట్రాప్ కెమెరాలు అమర్చవచ్చు. పలుచోట్ల ఈ పులి సంచరిస్తుండడం వల్ల వాటిని పెట్టలేక పోతున్నాము. ప్రస్తుతం అటవీ సిబ్బంది పులి పాదముద్రలను గుర్తించి ఆయా ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

-ఎస్.వెంకటేష్, జిల్లా అటవీశాఖ అధికారి


ప్రజలను అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ సిబ్బంది


కోయరాజు వేషంలో..

ఆయన ఓ మారుమూల గిరిజన గ్రామంలో జన్మించారు. చిన్నప్పటి నుంచే నృత్యాలు, నాటకాలు అంటే పిచ్చి. తన తొమ్మిదో ఏటాలో స్వగ్రామంలో జరిగిన ఓ పండగ నాడు మొదటిసారిగా గజ్జె కట్టి నృత్య, నట జీవితానికి నాంది పలికారు. నాటి నుంచి నేటి వరకు జానపదం, ద్విభాషా నాటిక, నాటకాలు, సినీ, టీవీ రంగాల్లో తనదైన శైలిలో రాణిస్తున్నారు. ఆయనే కుమార్‌నాయక్. కళారంగం కలికితురాయి కుమార్‌నాయక్‌పై 'ఆంధ్రజ్యోతి' కథనం..


అమాయకుడు నాటకంలో కుమార్‌నాయక్

నటనలో నాయక్

- కళారంగం కలికితురాయి కుమార్‌నాయక్
- కోయిడాన్స్‌తో మొదలైన ప్రస్థానం
- సినీ నటుడిగా ఎదిగిన వైనం
- వందల సంఖ్యలో నాటికలు, నాటకాలు ప్రదర్శన
- ఎన్నో అవార్డులు సొంతం

పలాస రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):

జీవితమే ఒక రంగస్థలం అనే చందాన నిరంతరం నాటికలు, నాటకాలు, సినీ, టీవీ రంగాల్లో రాణిస్తూ, కళామతల్లి సేవలో నిమగ్నమయ్యారు కళాకారుడు కుమార్‌నాయక్. ఈయన 1960లో మందస మండలం బొగాబంద అనే మారుమూల గిరిజన గ్రామంలో జన్మించారు. 9వ ఏటా నుంచే కోయ నృత్యాలు వేస్తూ తనలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీశారు. పలు గ్రామాల్లో జరిగే నందన్న, అమ్మవారి సంబరాల్లో పగటి వేషాలు, నాటికలు వేశారు. ఒకపక్క హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ, మరోపక్క వివిధ నాటక పరిషత్‌ల్లో ప్రదర్శనలు ఇచ్చారు. సుమారు 57 ఏళ్లుగా తన కళా ప్రతిభతో ముందుకు సాగుతున్నారు. సోంపేట మండలం మామిడిపల్లి వసతి గృహం వార్డెన్‌గా ఐదేళ్ల కిందట రిటైర్డ్ అయ్యారు. అయినా, తన ప్రదర్శనలు మాత్రం కొనసాగిస్తున్నారు.

1980 దశకం నుంచే..

ముఖ్యంగా కుమార్‌నాయక్ 1980 దశకంలో ఇచ్ఛాపురం నుంచి హైదరాబాద్ వరకూ ఎన్నో ప్రదర్శనలు నిర్వహించారు. గిరిజన ప్రాంతంలో ఒడియా మాధ్యమం తెలిసి ఉండడంతో ఇటు తెలుగు, అటు ఒడియా నాటికలు వేశారు. బరంపురం, ఛత్రపురం, గంజాం, హంజిలికాట్, నవరంగ్‌పూర్, కాశీనగర్, గుణుపూర్, రాయడగ, జయపూర్‌లో ఒడియా నాటికలతో పాటు తెలుగు నాటికలు ప్రదర్శించారు. ఇటీవల దుర్దశ అనే ఒడియా నాటికతో ఆయన మూడు రాష్ట్రాల్లో ప్రదర్శనలు చేపట్టి ఉత్తమ నాటిక అవార్డును సాధించారు. వీటితో పాటు జలారి జంగమయ్య, సూరిగాడికి చదువొచ్చే, కంచం కాదంటుంది, లంకెబిందెలో లక్కాపిక్క, కోయదొరకొంటేదంపతులు, చిలకజోస్యం, చీడపురుగులు, పిడికిలి, విజన్-420, ట్రీట్మెంట్, నీతి నీ స్థానం ఎక్కడ, కొడుకుపుట్టాలా వంటి పలు నాటికలు, నాటకాలు వేశారు. ఛత్తీస్‌గఢ్ భిలాయ్‌లో సుమారు 50 నాటికలతో పాటు అండమాన్, వెస్ట్‌బెంగాల్‌లో తన సభ్యులతో తెలుగు నాటికలు ప్రదర్శించి మంచి పేరును సాధించారు. కుమార్‌నాయక్ పలు సినిమాల్లో కూడా నటించారు. వీరగున్నమ్మ, పలాస-1978, రెండు అక్షరాలు, నాకొక శ్రీమతి కావాలి, వాడుఎవడు, సురభి70 ఎంఎం, పల్లెగూటికి పండగొచ్చింది, మీరాజ్ వంటి సినిమాల్లో ఉత్తమ నటన కనబర్చారు. ఈ సందర్భంగా దర్శకరత్న దాసరి నారాయణరావు, హీరో సుమన్, హీరోయిన్ ఆమని, కవి సి.నారాయణరెడ్డి, ఎల్‌బీ శ్రీరామ్, కొండవలస లక్ష్మణరావుతో పాటు ఒడియా యువహీరో బాబూబూసాన్, ఉత్తమ్ మహంతి, విజయ్‌మహంతి వంటి వారి నుంచి పలు అవార్డులు అందుకున్నారు. వేల సంఖ్యలో నృత్య, నాటిక పోటీలకు న్యాయనిర్ణేతలుగా కూడా వ్యవహరించారు. ప్రస్తుతం ఈయన పలాసలో నివాసం ఉంటున్నారు.


కుమార్‌నాయక్


దర్శకరత్న దాసరి నారాయణరావు నుంచి ఉత్తమనటుడు అవార్డు అందుకుంటున్న కుమార్‌నాయక్ (ఫైల్)

బంగారు ఆభరణాలు ఇవ్వండి

● గార ఎస్‌బీఐ బ్రాంచ్ ఎదుట ఖాతాదారుల నిరసన



గార ఎస్‌బీఐ బ్రాంచ్ గేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఖాతాదారులు

గార, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తాకట్టు పెట్టిన ఆభరణాలు ఇవ్వాలని ఖాతాదారులు డిమాండ్ చేశారు.ఈ మేరకు బంగారం ఆభరణాలు తాకట్టు పెట్టిన ఖాతాదారులు సోమవారం గార స్టేట్ బ్యాంక్ ఎదుట నిరసనతెలిపారు. ఇటీవల బ్యాంకు వద్దకు వచ్చి తమ బంగారు ఆభరణాలు ఇవ్వాలని నిరసన తెలిపిన విషయం విదితమే. ఆ సమయంలో బ్యాంకు ఏఆర్ఎం రామరాజు ఖాతాదారులతో మాట్లాడి డిసెంబరు రెండోతేదీన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.దీంతో పలువురు ఖాతాదారులు సోమవారం బ్యాంక్ గేట్ ఎదుట బంగారు ఆభరణాల ఇవ్వాలని నిరసన తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న గార ఎస్ఐ ఆర్.జనార్దన్ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. ఖాతాదారులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో అక్కడకు చేరుకున్న బ్యాంకు ఏఆర్ఎం రామరాజు ఖాతాదారులతో మాట్లాడారు. బంగారు ఆభరణాలే తమకు ఇవ్వాలని పట్టుపట్టారు. ఆ సమయంలో బ్యాంక్ ఆర్ఎంకు కొందరు ఖాతాదారులు ఫోన్‌చేసి తమ బంగారు ఆభరణాలు వెంటనే ఇప్పించాలని కోరారు. తాను హైదరాబాద్‌లో ఉన్నందున మంగళవారం వచ్చి మాట్లాడుతానని చెప్పడంతో ఖాతాదారులు నిరసన కార్యక్రమం విరమించారు. కార్యక్రమంలో సర్పంచ్ మార్పు దుర్గా పృథ్వీరాజ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జల్లు రాజీవ్ పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించండి: ఎస్పీ



అర్జీదారులతో మాట్లాడుతున్న మహేశ్వరరెడ్డి

అరసవల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్ లేకుండా చట్టప్రకారం పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికలో ఆయన జిల్లాలోని నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 50 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ త్వరగా చర్యలు చేపట్టి సకాలంలో అర్జీ లను పరిష్కరించాలని కోరారు.ఫిర్యాదు లపై సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి బాధితు లకు సత్వర న్యాయంచేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.ఈసందర్భంగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకు ఎస్పీ స్వయంగావెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, పరిష్కరిస్తామని భరోసాఇచ్చారు.

లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే శంకర్

గార, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. సోమవారం రాత్రి బూరవెల్లిలో సుంకాన శ్రీరాములు గురుస్వామి నిర్వహించిన అయ్యప్పస్వామి అంబలం పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్మీనరసింహ ఆలయ అభివృద్ధికి టీటీడీ నిధుల కోసం లేఖరాయనున్నట్లు తెలిపారు. బూరవెల్లిలో బీసీ కమ్యూనిటీ హాలు మంజూరుచేశామని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాగులవలసలో పది గొర్రెలు మృతి

జి.సిగడాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవలసలో పల్లా లక్ష్మీనారాయణకు చెందిన పది గొర్రెలు సోమవారం మృతి చెందాయి. బాధితుడి కథనం మేరకు.. మేతకు ఆదివారం సాయంత్రం తీసుకువెళ్లి తిరిగి గొర్రెల షెడ్‌లో పెట్టాడు. ఉదయం చూసేసరికి పది గొర్రెలు మృతి చెంది ఉన్నాయి. ఈ విషయాన్ని మండల పశువైద్యాధికారి ఉప్పాడ సుమన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గొర్రెలకు పోస్టుమార్టం నిర్వహించి నివేదికను శ్రీకాకుళం పశుకేంద్ర ల్యాబ్‌కు పంపించినట్లు సుమన్ తెలిపారు. మేతకు తీసుకువెళ్లిన సమయంలో అరగని రాని ఆహారం తిని ఉంటాయేమోనని అధికారులు భావిస్తున్నారు. పది గొర్రెలు మృతితో సుమారు రూ.1.50 లక్షలు నష్టం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనావేశారు.

సివిల్ సప్లయ్ డీఎంగా వేణుగోపాల్

శ్రీకాకుళం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్‌గా టి.వేణుగోపాల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మర్యాదపూర్వకంగా కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్‌ను కలుసుకున్నారు.అనంతరం సివిల్‌సప్లయ్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ప్రస్తుతం తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. ఇదివరకు ఎఫ్‌ఎసీ డీఎంగా వ్యవహరించిన అసిస్టెంట్ మేనేజర్(టెక్నికల్) శ్రీనివాసరావు ఇక పూర్వపు పోస్టులో జిల్లా సివిల్ సప్లయ్ కార్యాలయంలోనే కొనసాగనున్నారు.

బాలికా సంరక్షణపై దృష్టిసారించాలి: ఎంపీడీవో

సరుబుజ్జిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాలికా సంరక్షణపై దృష్టిసారించాలని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. సోమవారం స్థానిక మండలపరిషత్ కార్యాల యంలో బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మండల స్థాయి కిషోర్ వికాసం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవోతోపాటు ఐసీడీఎస్ పీవో గీత,ఎంఈవోలు బాలరాజు, శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ బి.రామారావు మహిళా సభ్యులకు బాల్యవివాహాలు, రక్తహీనత, సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

న్యాయసేవా సదన్‌లో ప్రీ లోక్ అదాలత్

గుజరాతీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టు ఆవరణలోగల న్యాయసేవా సదన్‌లో జరిగిన సోమవారం ప్రీ లోక్ అదాలత్ నిర్వహించారు.ఈ సందర్భంగా యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌కు సంబంధించి 3, నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీకు సంబంధించి 10, టాటా ఏఐజీ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీకు సంబంధించి ఆరు కేసులు రాజీ అయ్యాయి.

కృత్యాధార బోధనా పద్ధతులు పాటించాలి

లావేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఆటపాటలతో కృత్యాధార బోధనా పద్ధతులను పాటించాలని బెజ్జిపురం యూత్‌క్లబ్ డైరెక్టర్ ఎం.ప్రసాదరావు తెలిపారు. సోమవారం బెజ్జిపురం యూత్‌క్లబ్ ఆవరణలో ఇండియా లిటరసీ బెంగళూరు ఆధ్వర్యంలో మండలంలోని 42ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు కృత్యాధార బోధనాపద్ధతులపై శిక్షణనిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గంట్యాడ అప్పలనాయుడు పాల్గొన్నారు.

రద్దుచేసిన పింఛన్లు పునరుద్ధరించాలి: దువ్వాడ

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): రద్దుచేసిన పింఛన్లు పునరుద్ధరించాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కోటబొమ్మాళి మండలంలోని తాడిపత్తి సచివాలయం పరిధిలో అర్హులైన 20 మంది పింఛన్లను నిలిపివేయాలని మంత్రి అచ్చెన్నాయుడు లేఖ రాయడంతో ఆపేశారని తెలిపారు.

పొలాల్లో నీటిని మళ్లించాలి: ఏవో

సోంపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంట పొలాల్లోని నీటిని బయటకు మళ్లించి లీటరు నీటిలో 100గ్రాముల ఉప్పుకలిపి పిచికారి చేయాలని ఏవో బి.నరసింహమూర్తి తెలిపారు. సోమవారం పలాసపురం, బారువ, బేసిరామచంద్రాపురం గ్రామాల్లో వర్షాలకు తడిచిపోయిన పంటలను పరిశీలించారు.

● కంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నీట మునిగిన వరి పంటను సంరక్షించుకునేందుకు రైతులు అధికారుల సూచనలు పాటించాలని ఏవో ధనుంజయ కోరారు. జలంత్రకోటలో వర్షానికి తడిచిన వరి పంటను పరిశీలించారు.

● ఇచ్ఛాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):మండలంలోని బూర్జుపాడు తదితర గ్రామాల్లో పంటపొలాలను ఏవో టి.భార్గవి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిల్వఉన్న నీటిని తొలగిస్తే పంటకు నష్టం జరగదని తెలిపారు.

బాలికల అక్రమ రవాణా నిరోధంపై అవగాహన

కంచిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కంచిలి రైలు నిలయంలో బాలికల అక్రమ రవాణా నిరోధించడం, బాలికల రక్షణపై సోమవారం చైల్డ్ హెల్ప్‌డెస్క్ టీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈసందర్భంగా రైలునిలయంలో ప్రయాణికులు, పాదచారులతో మాట్లాడారు. బాలికలపై జరుగుతున్న లైంగిక దాడులు, సంరక్షణ కోసం 1098 నంబరుకు సమాచారం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ ప్రతినిధులు ఆర్. జాస్మిన్‌కుమారి పాల్గొన్నారు.



కంచిలి: జలంత్రకోటలో పొలంలో చేరిన నీటిని మళ్లించేందుకు కాలువలు ఏర్పాటుచేసిన రైతులు



కవిటి: నేలకొరిగిన వరి పంట



ఇచ్ఛాపురం: బూర్జుపాడులో..

పొలాల్లో నీరు.. అన్నదాతకు కన్నీరు

● ఇంకా వీడని తుఫాన్ భయాందోళనలు
● పంటలను రక్షించుకోవడానికి రైతులు అగచాట్లు



హరిపురం: నర్సింగపురం వద్ద నీటిలో నానుతున్న వరి కంకులను ఎత్తికడుతున్న రైతులు

జిల్లాలోని తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు అగచాట్లకు గురవుతున్నారు. ప్రధానంగా పలుచోట్ల పొలాల్లోకి నీరుచేరడంతో పంట తడిచి ముద్దవుతోంది. కొన్ని చోట్ల కోసిన వరిపంట కుప్పలు పెట్టకపోవడంతో మొలకలు వస్తుండడంతో అన్నదాతలు కన్నీటి పర్యాంతమవుతున్నారు.ఈనేపథ్యంలో తడిచిపోతున్న వరి పంటను రక్షించుకోవడానికి రైతులు అగచాట్లకు గురవుతున్నారు. సోమవారం కూడా రోజంతా ముబ్బులువేయడంతో రైతుల్లో తుఫాన్ భయాందోళనలు వీడలేదు.

-ఆంధ్రజ్యోతి బృందం



నందిగాంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



పలాసరూరల్: కొత్తూరు వద్ద పూర్తిగా వంగిపోయిన చేను



కోటబొమ్మాళి: పడిపోయిన వరి చేను



వజ్రపుకొత్తూరు: పెద్దబొడ్డపాడులో పొలంలో చేరిన నీటిని తోడుతున్న రైతు

నిర్వహణ లేక.. నిరుపయోగం

● ఇదీ కవిటిలో చెత్తసేకరణ వాహనం పరిస్థితి



కవిటిలో మూలకుచేరిన చెత్త సేకరణ వాహనం

కవిటి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కవిటి పంచాయతీ కార్యాలయానికి సమీపంలో చెత్తసేకరణ వాహనం నిర్వహించకుండా నిరుపయోగంగా విడిచిపెట్టారు. గత ప్రభుత్వం పంచాయతీలో చెత్త సేకరించి సంపద కేంద్రానికి తరలించాలన్న ఉద్దేశంతో వాహనాన్నిసమకూర్చింది. ఈవాహనం తడి,పొడి చెత్తసేకరణకు వినియోగించకపోవడంతో తుప్పుపడుతోంది. నెలల తరబడి తుప్పలు, మట్టి పక్కన పార్కింగ్ చేయడంతో టైర్లు కూడా పాడవుతున్నాయి. పంచాయతీ కార్యాలయానికి సమీపంలో ఖాళీ ప్రదేశంలో వాహనం నెలల తరబడి ఉండడంతో పిచ్చిమొక్కలతో నిండిపోయిఉంది. తక్షణమే పంచాయతీ అధికారులు చెత్తసేకరణకోసం లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన వాహనం వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

నేడు జ్ఞాన సరస్వతి అమ్మవారికి పూజలు

ఎచ్చెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని జ్ఞానసరస్వతి దేవి ఆలయంలో మంగళవారంఅమ్మవారికి మూలా నక్షత్ర అభిషేకపూజలు నిర్వహించనున్నారు. మంగళవారం మార్గశిర శుద్ధ విదియ పురస్కరించుకుని ఉదయం 6.30 గంటల నుంచి భక్తులు పూజల్లో పాల్గొవాలని నిర్వాహకులు కోరారు. భక్తులు అవసరమైన పూజా ద్రవ్యాలతో హాజరుకావాలని పేర్కొన్నారు.

5,6 తేదీల్లో పాలిటెక్ ఫెస్ట్

ఎచ్చెర్ల,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో ఈనెల 5,6 తేదీల్లో శ్రీకాకుళం ప్రాంతీయ స్థాయి పాలిటెక్ ఫెస్ట్ నిర్వహించనున్నారు. ఈమేరకు గోడపత్రికను సోమవారం ఆవిష్కరించారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మక దృష్టితో తయారుచేసిన వివిధ ప్రాజెక్టలను ఈఫెస్ట్‌లో ప్రదర్శిస్తారు. ఈ ఫెస్ట్‌లో పారిశ్రామిక, విద్యారంగ నిపుణుల కమిటీ ఎంపికచేసిన ఉత్తమమైన మొదటి ప్రాజెక్టుకు రూ.25,000, రెండో ప్రాజెక్టుకు రూ.10,000 నగదు బహుమతి అందజేస్తారు.ఈ ఫెస్ట్‌లో ఎంపికైన ఉత్తమ ప్రాజెక్టలను రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకి రామయ్య, ప్రభుత్వమహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందనాయుడు పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలి: కలెక్టర్

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్మీ కంపోస్టు విక్రయాన్ని ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. సోమవారం శ్రీకాకుళంలోని జడ్పీ సమావేశ మందిరం బయట ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్మీకంపోస్టును పంచాయతీల నుంచి స్వయం సహాయక సంఘాలకు సరఫరా చేస్తే వారు విక్రయిస్తారని చెప్పారు. వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఏర్పాటు చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో కె.భారతి సౌజన్య పాల్గొన్నారు.

విరాళాల సేకరణ పోస్టర్ ఆవిష్కరణ

దేశరక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర సైనికుల కుటుంబాల సహాయార్థం సాయుధ దళాల పతాక దినోత్సవం కోసం విరాళాలు సేకరణ పోస్టర్‌ను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆవిష్కరించారు. అక్షర వెలుగుపుస్తకాన్ని విడుదలచేశారు. కార్యక్రమం లో జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్, డీఆర్వో ఎం.వేంకటేశ్వరరావు, డీఈవో పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు: ఎమ్మెల్యే రవికుమార్



విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేస్తున్న రవికుమార్

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని తాళ్లవలస కేజీబీవీ పాఠశాలలో 234 మంది విద్యార్థినులకు ఆమదాలవలస సత్యసాయి సేవా సమితి సమకూర్చిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో సమగ్ర విద్యాభివృద్ధి సాధించడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని తెలిపారు. కార్య క్రమంలోటీడీపీ నాయకులు నూకరాజు, సనపల డిల్లేశ్వరరావు, సంపదరావు మురళీధరరావు, తమ్మినేని అమర్నాథ్, ఎన్ని శ్రీదేవి, సత్యసాయి సేవా సభ్యులు, కేజీబీవీ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ చట్టాల్లో మార్పులు అనివార్యం

● డీఎస్ఎన్ఎల్‌యూ వీసీ ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు



మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు

ఎచ్చెర్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజ శ్రేయస్సు, దేశ భద్రత కోసం న్యాయచట్టాల్లో మార్పులు అనివార్యమయ్యాయని దామోదర సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డీఎస్ఎన్ఎల్‌యూ) వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు తెలిపారు. సోమవారం ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో క్రిమినల్ జస్టిస్ లా అండ్ రీసెంట్ ట్రెండ్స్ అన్న అంశంపై ఆయన మాట్లాడారు. బ్రిటీష్ కాలంనాటి పలు చట్టాల్లో స్వల్ప మార్పులు చేసి ప్రజలకు సరైన న్యాయం అందేలా నూతన చట్టాలను పార్లమెంటు ఇటీవల ఆమోదించిందని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ, న్యాయ విద్యా విభాగం సమన్వయకర్త డాక్టర్ వై.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

డయాలసిస్ కేంద్రం పరిశీలన

కవిటి,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): కవిటి ప్రభుత్వాసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్సీ నర్తు రామారావు సోమవారం పరిశీలించారు. డయాలసిస్ కేంద్రంలో 19 యూనిట్లు ఉన్నాయని, ప్రతి రోజూ 60మందికి వైద్యసౌకర్యం కల్పిస్తున్నామని, ఇంకా పలువురు రోగులు వెయిటింగ్‌లో ఉన్నారని సిబ్బంది ఆయనకు వివరించారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి రోగులకు సౌకర్యం కల్పించేందుకు కృషిచేస్తానని రామారావు తెలిపారు. ఆయన వెంట వైసీపీ నేతలు పి.చంద్రశేఖర్, డి.దుర్యోధన ఉన్నారు.

ఫెన్సింగ్ పోటీలకు బాలిక ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 2: రణస్థలం మండలంలోని కోటపాలెం జడ్పీ ఉన్నతపాఠశాలలో చదువుతున్న పూజిత జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యింది. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-19 కేటగిరిలో కాంస్య పతకాన్ని కైవశం చేసుకుంది. ఈ మేరకు పూజితాను ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు బలభద్రుని రాజా, శిక్షకుడు వంశీ, పీడీ, పీఈటీలు డి.భవానీ, భాగ్యలక్ష్మి, యశోద, అనిత, రాములమ్మ, పుష్పలత అభినందించారు.

బ్యాడ్మింటన్ టోర్నీకి అఫీషియల్‌గా సూరిబాబు

చిలకపాలెం జడ్పీ హెచ్‌ఎస్‌లో పీడీగా పనిచేస్తున్న సంపతిరావు సూరిబాబును జాతీయస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు అఫీషియల్‌గా నియమించినట్లు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) నుంచి ఉత్తర్వులు అందాయి. బ్యాడ్మింటన్‌వరల్డ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అసోంలోని గౌహతిలో మంగళవారం నుంచి నిర్వహించనున్న టోర్నమెంట్‌కు పిలుపురావడంతో బయలుదేరి వెళ్లారు. ఈ మేరకు శ్రీకాకుళం బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సాగర్, కార్యదర్శి ఎం.అశోక్, ప్యాట్రన్ గూడేన సోమేశ్వరరావు, జి.అనీల్‌కుమార్, జి. ప్రసాద్ తదితరులు సూరిబాబును అభినందించారు.

300 మందికి దుప్పట్ల పంపిణీ

ఆమదాలవలస, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘంలోని 20వ వార్డు పరిధిలోగల వెంగళరావుకాలనీలో బుడుమూరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 300 మందికి సోమవారం దుప్పట్లు, రగ్గులను పంపిణీచేశారు. కార్యక్రమంలో పాతిన గిరిబాబు, బొడ్డేపల్లి రవికుమార్, బొడ్డేపల్లి సూర్యారావు, ఉపాధ్యాయులు నూక అప్పలనాయుడు, గొండు శ్రీనివాస్, కోటిపా త్రుని కైలాష్, దుప్పల వాసుదేవరావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఇచ్ఛాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ ఎస్ఐ చిన్నమనాయుడు తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురంలోని నీలకంఠేశ్వరాలయం వీధిలో వార్డు ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

అప్‌గ్రేడ్ అయ్యేనా?

● టెక్కలి మునిసిపాలిటీపై ప్రజల ఆసక్తి ● సదుపాయాలు పెరిగేందుకు అవకాశం

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటు డివిజన్ కేంద్రంగా, అటు మేజర్ పంచాయతీగా ఉన్న టెక్కలి మేజర్ పంచాయతీగా 1952లో గుర్తించబడింది. నాటి నుంచి నేటి వరకు సుమారు ఏడు దశాబ్దాల పాటు మేజర్ పంచాయతీగానే ఉంది కాని మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ కాలేదు. 2009లో మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసేందుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినా స్థానిక నేతలు అడ్డుకోవడంతో మరో అడుగు ముందుకు పడలేదు. అలాగే 2016లో కూడా టెక్కలిని అప్‌గ్రేడ్ చేసేందుకు మరోసారి ప్రతిపాదనలు పంపారు. ఈసారి టెక్కలితో పాటు చుట్టుపక్కల ఉన్న అయోధ్యపురం, తొలుసూరుపల్లి, భగవాన్‌పురం, అక్కవరం, సీతాపురం గ్రామ పంచాయతీలను విలీనం చేసి మునిసిపాలిటీగా ప్రతిపాదనలు చేసినా పాలకులు మోకాలడ్డారు. దీంతో అప్పటి నుంచి అప్‌గ్రేడ్ విషయంలో ఎదుగూ బొదుగూ లేకుండా పోయింది. అయితే మేజర్ పంచాయతీగా ఉన్న టెక్కలి ఇటు ఆదాయ పరంగా, అటు ప్రజల పరంగా, వివిధ ఆదాయమార్గాలపరంగా అభివృద్ధి ఉన్నా మునిసిపాలిటీ హోదా పొందకపోవడంతో స్థానిక ప్రజల్లో నిరాసక్తత కనిపిస్తోంది.

విస్తీర్ణం :4.04 చ.కిమీ
పంచాయతీ ఏర్పాటు: 1952
జనాభా : 35 వేలు
వార్డులు : 20
వీధులు : 130 వరకు
పంచాయతీ ఆదాయం: సుమారు రూ.92 లక్షలు


టెక్కలి పట్టణ ఏరియల్ వ్యూ

2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీ ప్రతిపాదన ఊసే లేకుండా పోయింది. ఎమ్మెల్యేగా ఉన్న కింజరాపు అచ్చెన్నాయుడు ఎన్నికల ముందు, మంత్రి పదవి చేపట్టిన తరువాత టెక్కలిలో ఏ సమావేశం జరిగినా టెక్కలిని జిల్లా కేంద్రంగా తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతానని వెల్లడించారు.

అయితే ఆ పరిస్థితికి టెక్కలి నోచుకోవాలంటే మునిసిపాలిటీగా మారాల్సిన అవసరముంది. 2011 జనాభా లెక్కల ప్రకారం పంచాయతీ జనాభా 27వేల మందిగా లెక్కలు చూపుతున్నా, ప్రస్తుతం 35 వేలు పైబడి జనాభా దాటింది. ఇప్పటికైనా పాలకులు టెక్కలిని మునిసిపాలిటీగా ప్రకటిస్తే పట్టణం అభివృద్ధి చెంది చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మరిన్ని సదుపాయాలు దక్కే అవకాశం ఉంటుందని పలువురు పట్టణ వాసులు అభిప్రాయ పడుతున్నారు.

మునిసిపాలిటీ అయితే అభివృద్ధి సాధ్యం



టెక్కలి మేజర్ పంచాయతీ మునిసిపాల్టీగా రూపాంతరం చెందితేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. మున్సిపాల్టీకి ప్రత్యేకంగా నిధులు మంజూరవడం ద్వారా పట్టణ రూపురేఖలు మారుతాయి. అలాగే ఆదాయ వనరులు పెరుగుతాయి.

- కూన పార్వతి, ఎంపీటీసీ సభ్యురాలు, టెక్కలి

కలగా మిగిలిపోయింది



టెక్కలి మేజర్ పంచాయతీ మునిసిపాలిటీగా మారడం కలగా మిగిలిపోయింది. మూడు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్నాం. మున్సిపాలిటీగా మారితే రోడ్లు, కాలువలు, తాగు నీరు ఇతర అభివృద్ధి పనులు జరిగి ప్రజలకు సదుపాయాలు పెరుగుతాయి. ప్రధాన సమస్యలకు మోక్షం లభిస్తుంది.

- సాహుకారి మోహనరావు, టెక్కలి

క్రైం కార్నర్

ఎన్‌ఫీల్డ్, పల్సర్ వాహనాలే లక్ష్యంగా చోరీ

● ఒడిశా వాసి వద్ద 15 బైక్‌లు స్వాధీనం


పట్టుబడిన నిందితుడితో కాశీబుగ్గ డీఎస్పీ, సీఐ, క్రైమ్ పోలీసులు

పలాస, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): అత్యంత ఖరీదైన ఎన్‌ఫీల్డ్, పల్సర్ వాహనాలే లక్ష్యంగా ఒడిశాకు చెందిన ఓ వ్యక్తి వాహనాలు చోరీ చేస్తూ కాశీబుగ్గ పోలీసులకు పట్టుబడ్డాడు. ఆయన వద్ద నుంచి 15 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకటఅప్పారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్టేషన్ ఆవరణలో నిందితుడిని విలేకరుల ఎదుట ప్రవేశ పెట్టారు. ఆయన మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రం రాయఘడ బ్లాక్ మండల సాహి గ్రామానికి చెందిన అమీర్‌బుయాన్ బైక్ చోరీ చేసి ఇచ్ఛాపురం నుంచి వస్తున్నాడని, మొగిలిపాడు హైవే వద్ద వాహనాల తనిఖీ సమయంలో ఆయన కదలికల్లో తేడా రావడంతో పట్టుకుని ప్రశ్నించడంతో అసలు విషయం బయట పడిందన్నారు. బైక్‌లను చోరీ చేసి విక్రయిస్తున్న వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా దొంగతనాలు బయటపడ్డాయన్నారు. పలాసలో 8, మందస లో రెండు, టెక్కలిలో ఒకటి, సోంపేటలో 4 బైక్‌లు చోరీ చేసి విక్రయానికి పెట్టడంతో వాటిని ప్రత్యేక పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు బుయాన్ ముఠా మొత్తం 15 వాహనాలు చోరీ చేశారన్నారు. నిందితుడికి ద్విచక్రవానాలు రిపేరు చేసే షాపు ఉందని, ఆయనకు వచ్చే ఆదాయం సరిపడక దొంగగా మారాడన్నారు. ఈ క్రమంలో ఆయనకు సిగిలిపొదరో గ్రామానికి చెందిన అంజు, చెలిగడకి చెందిన ఆలీఫ్, అంతరాడకి చెందిన సిద్ధాంత్, రామగిరికి చెందిన బిల్లా, సునీల్ నాయక్, బులడగామకి చెందిన లాడెన్, పలాస మండలం పెదంచలకి చెందిన తమిరి రఘునాథ్‌తో పరిచయం ఏర్పడిందని, విడివిడిగా దొంగతనాలు చేశావారన్నారు. ఈ నేపథ్యంలో నిందితుడు ఒక్కడే సోంపేట, మందస, పలాస, టెక్కలి ప్రాంతాల్లో 15 వాహనాలు చోరీ చేసి తన గ్యారేజిలో భద్రపరిచాడని, ఆదివారం పలాస రైల్వే స్టేషన్‌లో పల్సర్‌ని దొంగతనం చేసి విశాఖపట్నంలో ఆ వాహనాన్ని అమ్మడానికి వెళ్లి వస్తుండగా పోలీసులు అరెస్టు చేశారన్నారు. చిన్నబడాం వద్ద వినాయకచవితి మండపంలో రెండు వాహనాలు చోరీకి పాల్పడిన రఘునాథ్ వాహనాలతో పట్టుబడి పర్లాకిమిడి జైలులో ఉన్నాడని వివరించారు. వాహనాలు, నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న క్రైమ్ పోలీసులు గవరయ్య, ప్రసాద్, నీలకంఠం, షణ్ముఖరావులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో సీఐ డి.మోహనరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు పాపారావు మృతి

● మృతదేహం రిమ్స్‌కి అప్పగింత



పాపారావు మృతదేహాన్ని రిమ్స్ వైద్యులకు అందజేస్తున్న దృశ్యం (ఇన్‌సెట్‌లో) పాపారావు (ఫైల్)

టెక్కలి/అరసవల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రగతి శీల కార్మిక సంఘం నాయకుడు కోళ్ల పాపారావు (66) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని కుటుంబ సభ్యులు సోమవారం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి అప్పగించారు. పాపారావు కొంత కాలం పీపుల్స్‌వార్ పార్టీలో పనిచేసి అనారోగ్యంతో జన జీవన స్రవంతిలోకి వచ్చారు. ఆ తరువాత కాకరాపల్లి, సోంపేట, థర్మల్ పోరాట ఉద్యమాలు, నౌపడా రైల్వే ఉద్యమం, ఉప్పు కార్మికుల సమస్యలపై కార్మికులు, రైతులు పక్షాన పోరాటం చేశారు. ఆయన మృతి ఉద్యమాలకు తీరని లోటని ప్రజా సంఘాల నేతలు అభిప్రాయపడ్డాయి. తాను మరణించిన తరువాత దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం అందజేయాలని 2023లో అంతర్జాతీయ శరీర అవయవ దినోత్సవం సందర్భంగా పేర్కొన్నారని, అందుకు అనుగుణంగా రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలం, డాక్టర్ కేవీ రాంప్రసాద్, హెచ్‌వోడీ డాక్టర్ హేమా రాధికలకు అందజేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో కేఎస్‌పీఎస్ నాయకులు మిస్క కృష్ణయ్య, రొక్కం లోకనాథం, లోకేష్‌బాబు, కుమారస్వామి, ఈశ్వరరావు పాల్గొన్నారు. ఆయన మృతి ఉద్యమాలకు తీరనిలోటని డీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు తెలిపారు.

రిటైర్డ్ హవల్దార్‌కు ఘన స్వాగతం


సైనికుడికి స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

పలాసరూరల్, డిసెంబరు 2 (ఆంధ్ర జ్యోతి): దేశరక్షణ నిమిత్తం సైనికుడిగా 24 ఏళ్ల పాటు విధి నిర్వహణ చేపట్టి హవల్దార్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన మద్దిల మోహనరావుకు సోమవారం స్వగ్రామం బొడ్డ పాడులో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మాజీ సైనిక సంఘం సభ్యులు మాట్లాడుతూ.. దేశానికి చేసిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. పలాస రైల్వేస్టేషన్‌లో ఆయనకు గ్రామస్థులు, సంఘ సభ్యులు స్వాగతం పలికి గ్రామానికి తీసుకు వచ్చి సత్కరించారు. కార్యక్రమంలో బొడ్డపాడు గ్రామ సైనిక సంఘం అధ్యక్షుడు తామాడ రామారావు, కార్యదర్శి మోహనరావు, సభ్యులు గర్తం ఈశ్వరరావు, కిక్కర ఢిల్లీరావు, లక్ష్మణరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మార్చి 4 నుంచి జాతీయస్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు తదితరులు

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల (ఐతమ్)లో వచ్చే ఏడాది మార్చి 4 నుంచి 7వ తేదీ వరకు జాతీయస్థాయి గోకార్టింగ్ చాంపియన్‌షిప్ సీజన్-2 పోటీలు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు సోమవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.4 లక్షల విలువైన బహుమతులు అందజేయనున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఇంజనీరింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు, డీన్ డి.శ్రీరాములు, హెచ్‌వోడీలు అశోక్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

ఆదిత్యుని అంతరాలయ తలుపులకు వెండి తాపడం

అరసవల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలోని అంతరాలయ టేకు తలుపులకు వెండి తాపడాన్ని విశాఖకు చెందిన అజ్ఞాతభక్తుడు చేయించినట్లు ఈవో వై.భద్రాజీ తెలిపారు. ఈ మేరకు రూ. 30 లక్షల విలువైన సుమారు 24 కేజీల 500 గ్రాముల వెండి తాపడం సదరు దాత సహాయకుడు ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ, ఈవో భద్రాజీలకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా దాత పేరున ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలపై విచారణ

నందిగాం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మొండ్రాయివలస ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ నడుపూరు రాంబాబుపై వచ్చిన ఫిర్యాదుపై సోమవారం విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ అక్రమాలకు పాల్పడ్డాడంటూ గ్రామానికి చెందిన పలువురు డ్వామా పీడీకి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు ఏపీడీ శైలజ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఫిర్యాదుదారులు, ఫీల్డ్‌అసిస్టెంట్, వేతనదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకొని స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. ఎటువంటి ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. విచారణలో ఏపీవో ఎం.నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సామాజిక అడవులను పెంచాలి

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాతావరణం సమతుల్యంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించాలని టెక్కలి ఫారెస్ట్ రేంజ్ అధికారి జి. జగదీశ్వరరావు అన్నారు. సోమవారం శ్రీరాంపాడు హటహటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అపరిచితుల సమాచారం ఇవ్వండి

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపించినా, కొత్త వ్యక్తులు సంచరించినా వెంటనే సమాచారం ఇవ్వాలని సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం నర్సింగపల్లిలో 'సంకల్పం'లో భాగంగా గ్రామస్థులకు వివిధ అంశాలపై అవగాహన కలిగించారు. మాదకద్రవ్యాలు వినియోగం నేరమని, ఎవరైనా గంజాయి, మద్యం అమ్మకాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ రాము ఆధ్వర్యంలో రావివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దుబాయ్ విద్యా సదస్సులో సత్కారం



హిరమండలం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): యూఏఈకి చెందిన దుబాయ్‌లో నాలుగు రోజులుగా ప్రస్తుతం విద్యా రంగంలో జరుగుతున్న అనేక మార్పులపై జరుగుతున్న అంతర్జాతీయ విద్యా సదస్సులో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు గురువిల్లి వెంకటరమణ పాల్గొన్నారు. హిరమండలానికిచెందిన ఈయన ప్రస్తుతం వమరవల్లి డైట్‌లో మనోవిజ్ఞాన శాస్త్ర ఉపన్యాసకుడిగా పనిచేస్తున్నారు. విద్యా రంగంలో గణనీయంగా జరుగుతున్న మార్పులు, జీవన నైపుణ్యాలు, బాలల హక్కులు, బాధ్యతలు తదితర అంశాలపై దుబాయ్ సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సత్కరించారు.

పోలి పాడ్యమి పూజలు

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మార్గశీర్ష శుద్ధ పాడ్యమిని పురస్కరించుకుని సోమవారం దేవాలయాల్లో పోలి పాడ్యమి పూజలను మహిళలు నిర్వహించారు. తెల్లవారుజామున కాలువలు, చెరువుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి దీపాలను విడిచిపెట్టారు. ఆలయాల్లో దీపదానం చేపట్టారు. పోలిపాడ్యమి పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

భక్తిశ్రద్ధలతో..

నందిగాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో పోలిపాడ్యమి సందర్భంగా సోమవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కార్తీకమాసం ముగింపు సందర్భంగా మహిళలు తెల్లవారు జామున అరటిడొప్పల్లో దీపాలు విడిచిపెట్టి శైవ క్షేత్రాలను దర్శించుకుని పూజలు చేశారు.

ఉపాధి ఆడిట్‌ను విజయవంతం చేయండి

పోలాకి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిధులతో 2023-24 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టిన పనులపై చేపడుతున్న సామాజిక ఆడిట్‌ను విజయవంతం చేయాలని స్టేట్ రిసోర్స్‌పర్సన్ తిరుపతిరావు కోరారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గరిమెళ్ల వెంకట రవికుమార్, జిల్లా విజిలెన్స్ అధికారిని స్వరూపరాణి, ఉపాధి ఏపీడీలు పాల్గొన్నారు.

వైద్యులు, సిబ్బంది చిత్తశుద్ధితో సేవలందించాలి

● ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులు సంతృప్తి చెందేలా వైద్యులు, సిబ్బంది వైద్య సేవలను అందించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సోమవారం స్థానిక వంద పడకల ఆసుపత్రిలో సలహా కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉదయం కాకుండా మధ్యాహ్నం కూడా ఓపీ చూడాలని, రోగుల ఆక్యుపెన్సీ పెంచేలా సేవలను విస్తరించాలన్నారు. ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున సత్వర సేవలు అందించాలన్నారు. ఆసుపత్రిలో మౌలిక వసతులను ఆరు నెలల్లో పూర్తి స్థాయిలో కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సలహా కమిటీ సభ్యులు డా.నిక్కు పద్మావతి, మాదిన నల్లాన శాస్త్రి, శిమ్మ జగన్నాథం, పుచ్చల కల్పన, సూపరింటెండెంట్ శ్రీనివాసబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, మాజీ సర్పంచ్‌లు ఉణ్న రాజశ్రీ, గొద్దు చిట్టిబాబు, పీస కృష్ణ, ఉణ్న వెంకటేశ్వరరావు, జామి వెంకట్రావు, ఏవీబీపీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు: ఎమ్మెల్యే ఎంజీఆర్


పాతపట్నం: శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం/హిరమండలం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. పాతపట్నం, హిరమండలంలలో కేజీబీవీల్లో లైబ్రరీ, కంప్యూటర్ గదుల నిర్మాణాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు విద్యా సంస్థలకు దీటుగా సర్కారీ బడులను తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో రూ. 143.30 లక్షల వ్యయంతో హిరమండలం, పాతపట్నంలలోని కేజీబీవీల్లో భవనాలు నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, టీడీపీ నాయకులు యాళ్ల నాగేశ్వరరావు, జి.కామేశ్వరరావు, అధికారులు, పాఠశాలల స్పెషలాఫీసర్లు, ఎంఈవోలు పాల్గొన్నారు. ● ఇదిలా ఉండగా పాతపట్నం ఉపాధి కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే గోవిందరావును సోమవారం సత్కరించారు. సిబ్బంది పారదర్శంగా పనిచేయాలని, వేతనదారుల్లో ఉన్న అపోహలను తొలగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రకుమారి, ఏపీవో సురేష్, సాంకేతిక, క్షేత్ర సహాయకులు, మేట్లు, కూటమి నేతలు పాల్గొన్నారు.

సారవకోట మండలంలోనే పులి సంచారం

● ఇతర మండలాలకు వెళ్లిన ఆనవాలు లేవు
● అటవీశాఖ బీట్ అధికారి శివప్రసాద్



అన్నుపురంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న బీట్ అధికారి శివప్రసాద్

జలుమూరు (సారవకోట), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సారవకోట మండల పరిధిలోనే పులి సంచరిస్తోందని, ఇతర మండలాలకు వెళ్లిన ఆనవాళ్లు కనిపించడం లేదని అటవీశాఖ బీట్ అధికారి డి.శివప్రసాద్ తెలిపారు. అన్నుపురం, నారాయణపురం, చిన్నగుజ్జువాడ తదితర గ్రామాల్లో సోమవారం పర్యటించి ప్రజలకు అప్రమత్తం చేశారు. పులి అన్నుపురం, ధర్మలక్ష్మీపురం కొండల్లో ఉన్నట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయన్నారు. పరిసర గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తెల్లవారు జామున, సాయంత్రం పొలాల్లోకి రైతులు వెళ్లినపుడు ఒంటరిగా వెళ్లవద్దన్నారు. పులి పొడుగుపాడు హైవే దాటి దుప్పలపాడు, రేగులపాడు, జలుమూరు మండలం ఎర్రన్నపేట, సంతలబైలి గ్రామాల మీదుగా జమచక్రం వచ్చినట్లు ఆనవాళ్లు కనిపించాయన్నారు. ఎర్రన్నపేట పొలాల్లో కూడా పులి పాదముద్రలను గుర్తించామన్నారు. పాతపట్నం, ఇతర మండలాల్లో పులి సంచరిస్తున్నట్లు వస్తున్న వార్తలు వాస్తవం కావని ఇతర మండలాలకు చెందిన ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

మళ్లీ పులి కలకలం

కోటబొమ్మాళి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వాంగ్రాడ పంచాయతీ నర్సింగపల్లి పరిసరాల్లో సోమవారం తెల్లవారు జామున పులి కనిపించిందంటూ స్థానికులు చెప్పడంతో కలకలం రేగింది. ఈ నేపథ్యంలో ఉదయం పరిసరాల్లోని నిమ్మాడ, వాంగ్రాడ, పెద్ద బమ్మిడి, చిన్నబమ్మిడి గ్రామాల్లో ఆయా గ్రామ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని దండోరా వేయించారు. దీంతో ఏ క్షణంలోనైనా పులి గ్రామంలోకి రావచ్చని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అయితే పులి సారవకోట, పాతపట్నం మండలాలు దాటి వెళ్లిపోయిందని, ఇటు వచ్చే పరిస్థితి లేదని మరి కొందరు వాదిస్తున్నారు. సంబంధిత అటవీశాఖ అధికారులు ఈ గ్రామాల వైపు దృష్టి సారించి పులి నుంచి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

తాగునీరు లేక అల్లాడుతున్నాం..


ఖాళీ బిందెలతో మహిళల నిరసన

జలుమూరు డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నా మని అల్లాడ గ్రామానికి చెందిన మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కొళాయిల వద్ద ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు వద్ద నీటి సామర్థ్యం తగ్గడంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నీటి సరఫరాచేయాలని వారు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసులో ముద్దాయికి రెండేళ్లు జైలుశిక్ష

పాతపట్నం/అరసవల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని యశోదానగర్‌లో రెండిళ్ల మధ్య ఉన్న పిట్టగోడపై పూలమొక్కల ఉంచిన నేపథ్యంలో ఇరువురి మధ్య జరిగిన వివాదంలో నిందితురాలు గేదెల అమరావతిపై అట్రాసిటీ కేసు రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ నాలుగో అదనపు కోర్టు న్యాయాధికారి ఫణికుమార్ సోమవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ లావణ్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాతపట్నంలోని యశోదానగర్‌లో పి.చిన్నమ్మడు నివాసం ఉంటుండగా.. తూర్పు వైపు గేదెల అమరావతి కుటుంబంతో కలిసి రెండో అంతస్థుల ఇంటిలో ఉంటోంది. వీరి ఇళ్లకు మధ్య పిట్టగోడపై అమరావతి పూలమొక్కలను పెంచుతోంది. మొక్కలకు నీరు పోసే సమయంలో ఆ నీరు చిన్నమ్మడు ఉంచిన ధాన్యం, బట్టలపై పడి తడిచిపోతుండేవి. ఈ విషయం సదరు అమరావతిని అడుగ్గా నాఇష్టం ఈ గోడపై మొక్కలు పెట్టుకుంటానంటూ చిన్నమ్మడును కులం పేరుతో దూషించడంతో చిన్నమ్మడు భర్త ఇంటిలోకి తీసుకువెళ్లి పోయాడు. ఈ నేపథ్యంలో మొక్కలకు పోసిన నీరు తన ఇంటిలోకి రాకుండా చిన్నమ్మడు గట్టును నిర్మించింది. అయితే ఆ గట్టును అమరావతి 2020 ఫిబ్రవరి 24న విరగ్గొడుతుండగా చిన్నమ్మడు ప్రశ్నించింది. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. దీంతో అమరావతి చిన్నమ్మడును కులంపేరుతో దూషించడంతో పాటు నీళ్లను ఆమె ముఖంపై పోసింది. పూల కుండీని విసిరివేయడంతో చేతితో అడ్డుకునేందుకు చిన్నమ్మడు ప్రయత్నించగా తీవ్రంగా గాయమైంది. దీనిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ టి.రాజేష్ కేసు నమోదు చేశారు.

దీనిపై ట్రాఫిక్ డీఎస్పీ సీహెచ్‌జీవీ ప్రసాదరావు దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో నిందితురాలు అమరావతిపై కేసు రుజువు కావడంతో న్యాయాధికారి తుది తీర్పును ఇచ్చారు. నిందితురాలికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా కట్టనిచో మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని ఆ తీర్పులో పొందుపరిచారు. ఈ కేసుకు స్పెషల్ పీపీ వి.రఘురాం వాదించారు.

న్యూస్ బాక్స్

ఎండల మల్లన్న ఆదాయం రూ.30.30 లక్షలు

టెక్కలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రావివలస ఎండలమల్లికార్జున స్వామికి ఈ ఏడాది కార్తీకమాసం సందర్భంగా రూ.30,30,042 ఆదాయం వచ్చినట్లు ఈవో జి.గురునాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో శీఘ్రాభిషేకం టిక్కెట్ల రూపంలో రూ.10,25,680, శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.9,37,260, కేశఖండన ద్వారా రూ.69,520, తాత్కాలిక, శాశ్వత హుండీల ద్వారా రూ.9,95,582, ఇతర ఆదాయం రూ.2 వేలు వచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచనల మేరకు ఈ ఏడాది ఉచిత దర్శనం భక్తులకు అందించడం వల్ల గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.2,38,841 ఆదాయం తగ్గిందన్నారు. ఉత్సవాలు విజయవంతం చేసిన రెవెన్యూ, పోలీసు, పంచాయతీ, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

పలాస, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలనుంచి వచ్చే వివిధ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం కార్యాలయం ఆవరణలో గ్రీవెన్స్ నిర్వహించారు. వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో పొందుపరిచి ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. పారిశుధ్య నిర్వహణ, అక్రమ కట్టడాలు, రోడ్ల నిర్మాణం చేపట్టాలని వినతులు వచ్చాయన్నారు.

'తెప్పల'కు అవార్డు

పలాసరూరల్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రం భిలాయ్‌లో ప్రవాసాంధ్ర ప్రజానాట్యమండలి 44వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం పలాస జన జాగృతి గౌరవాధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి ఉత్తమ నాటక కర్తగా అవార్డును అందించారు. రెండురోజుల పాటు తెలుగు నాటికల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా నాటక రంగంలో విశేష సేవలందించిన కృష్ణమూర్తికి సత్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ నాటిక పరిషత్తుల సమాఖ్య అధ్యక్షుడు బుద్దాల వెంకటరామారావు, ప్రధాన నారాయణస్వామి, లండ రుద్రమూర్తి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ ర్యాలీని జయప్రదం చేయండి

పలాసరూరల్,డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలపై బుధవారం విజయవాడలో నిర్వహిస్తున్న ర్యాలీ, సభను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తామాడ సన్యాసిరావు కోరారు. ఈ మేరకు సోమవారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు మద్దిల రామారావు, వంకల అప్పయ్య, కుత్తుమ దుష్యంత్, పి.కామేశ్వర రావు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం అధ్యక్షుడిగా చక్రపతి

పాతపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా డా.కొండాల చక్రపతి ఎన్నికయ్యారు. ఈ మేరకు శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణంలో సంఘం ఎన్నికలు జరగ్గా మూడోసారి చక్రపతి ఎన్నికయ్యారు. ఈయన పాతపట్నం ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ మేరకు మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా.సూర్యచంద్రరావు ఎన్నిక ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఇదిలా ఉండగా సోమవారం స్థానిక కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధి.. నివారణ చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు విద్యార్థులు

నరసన్నపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంతర్ విశ్వవిద్యాలయ స్థాయిలో జరిగే ఫుట్‌బాల్ పోటీలకు స్థానిక డిగ్రీ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.లత సోమవారం తెలిపారు. ఈనెల 21 నుంచి 28 వరకు కేరళలో కాలికట్ యూనివర్సిటీలో దక్షిణాది రాష్ట్రాలఫుట్‌బాల్ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లోనూ ప్రతిభ కనబరచాలని ప్రిన్సిపాల్ లత, పీడీ కె.భోగేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.